Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# నీటి వృథా.. రేపటి కన్నీటి వ్యథ..

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

నీటి సంరక్షణ



ఎం.దాన కిషోర్, ఐఏఎస్

మూడో ప్రపంచయుద్ధం గానీ వస్తే అది కేవలం నీటి సమస్యల మీద మాత్రమే జరుగుతుందనేది ఏండ్ల తరబడి అనుకుంటున్న మాట. ప్రపంచంలో నేడు 165 దేశాలు తీవ్రమైన నీటి సంక్షోభంలో ఉన్నాయి. సౌతాఫ్రికాలోని కేప్‌టౌన్ నగరం ప్రపంచంలో నీరులేని నగరంగా చరిత్ర పుటల్లోకెక్కింది. రెండో నగరంగా బెంగళూరు ఉంటుందని అంచనా వేశారు. ఈ మాట వినడానికే భయంకరంగా ఉన్నది. 2050 నాటికి ప్రపంచంలోని మూడో వంతు నగరాలు నీటి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే నీటి వృథాను తగ్గించడం మినహా మరొక మార్గం లేదనేది విజ్ఞులు గ్రహించాలి.

హైదరాబాద్ మహా నగరానికి రెండు వందల కిలోమీటర్ల దూరంలోని గోదావరి, కృష్ణా నదుల నుంచి తెస్తున్న మంచినీటిని ప్రజలు జాగ్రత్తగా ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. రోజుకు 430 మిలియన్ గ్యాలన్ల మంచినీటిని పెద్దపెద్ద పైపుల ద్వారా లిఫ్టింగ్ చేస్తూ తెస్తున్న ఈ నీటిని వృథా చేయడం మంచిది కాదనేది ప్రజలు ఆలోచించాలి. 1642 కిలోమీటర్ల వైశాల్యంతో ఉన్న నగరానికి ఓఆర్ఆర్ వరకున్న అన్ని గ్రామాలకు ఇస్తున్న నీటిలో రోజుకు సుమారు 4 నుంచి 5 లక్షల మందికి సరిపోయే 20 మిలియన్ గ్యాలన్ల మంచినీటిని ప్రజలు వృథా చేస్తున్నారనేది హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి లెక్కలు చెబుతున్నాయి. ఒక కిలోలీటర్‌కు ప్రభుత్వం రూ.45 ఖర్చుచేస్తూ ప్రజలకు ఆ నీరు సబ్సిడీపై పేదలకు రూ.7కు, ఇతరులకు రూ.10లకు ఇస్తున్నారు. ఇంతటి విలువైన నీటిని వృథా చేస్తున్నప్పుడు ఆ నీరు రహదారులపై ప్రవహిస్తుంటే రహదారులు దెబ్బతింటున్నాయి. రోడ్లపై నిలిచిపోయిన నీటిలో క్రిమికీటకాలు చేరి అంటురోగాలు ప్రబలుతున్నాయి.

గతంలో జలం జీవం పేరుతో నీటి సంరక్షణ చర్యలకు ఉపక్రమించిన జలమండలి ప్రస్తుతం నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన తేవడానికి ప్రయత్నిస్తున్నది. నీటి వృథా ఎన్నోవిధాలుగా జరుగుతుంటుంది. ఇళ్లల్లో ఉండే నల్లాలకు లీకేజీలు ఏర్పడి బొట్టుబొట్టుగా కారిపోవడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు నిండిపోయి నీళ్లన్నీ కిందికి కారిపోవడం, రన్నింగ్ ట్యాప్స్ ద్వారా షేవింగ్, బ్రషింగ్ పనులు చేయడం, పైప్‌లైన్స్, వాల్వ్‌ల లీకేజీల ద్వారా నీళ్లు వృథా కావడం, పైపులతో కార్లు, ఇతర వాహనాలు కడుగటం, ఇంటి ఆవరణలు, పరిసరాలు పైపునీళ్లతో శుభ్రం చేసుకోవడం మనం రోజూ చూస్తుంటాం. పెద్దఎత్తున నీటిని వాడే హోటల్స్, రెస్టారెంట్స్, మాల్స్, సినిమా థియేటర్స్, దవాఖానలు తదితర ప్రదేశాల్లో నల్లాలకు ఆన్-ఆఫ్ బటన్స్ చెడిపోవడంతో నీరు వృథాగా పోవడం, షవర్స్ కింద స్నానాలు చేయడం, నల్లాల కిందనే బట్టలుతకడం, టాయిలెట్స్ ఫ్లషింగ్‌కు నాబ్స్ సరిగ్గా ఉండక నీరంతా వృథాగా పోవడం, మొక్కలకు, గార్డెనింగ్ కోసం, భవన నిర్మాణాల్లో క్యూరింగ్ కోసం కూడా మంచినీళ్లనే వాడటం వల్ల అధిక వ్యయప్రయాసలతో తెస్తున్న మంచినీరు వృథాగా పోతున్నది. రాజస్థాన్, మహారాష్ట్ర ప్రాంతాల్లో ఒక బిందెడు నీళ్ల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి ఉన్నది. మన నగరంలో అలాంటి పరిస్థితి లేదు. ఇళ్లలో నల్లాలున్నాయి. అవసరమైన మేరకు వాటర్ ట్యాంకర్లు వస్తున్నాయి. ప్రజలందరికీ నీటి అవసరాలు తీరుతున్నాయి. కానీ నీటి వృథాను అరికడుదామని చాలామంది ఆలోచించడం లేదు.

నీటి వృథాను అరికట్టడం కోసం, ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం వాటర్ లీడర్‌షిప్ అండ్ కన్జర్వేషన్ (వాక్)ను ఏర్పాటు చేయడం జరిగింది. సామాజిక బాధ్యతగా ఇందులో జేఎన్‌టీయూ లాంటి ప్రముఖ విద్యాసంస్థలు, ప్రశాంత్ మహాపాత్ర లాంటి సీనియర్ ఐఏఎస్ (రిటైర్డ్) అధికారులు, నీటికోసం అహర్నిశలు పాటుపడే వాటర్ ఎయిడ్ లాంటి అంతర్జాతీయ సంస్థలు, క్యాప్ జెమిని, ఇన్ఫోసిస్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన కార్పొరేట్ సంస్థలు, పేరున్న ఎన్జీవోలు, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు, జలమండలి డైరెక్టర్లు అందరినీ భాగస్వాములను చేశారు. ప్రపంచ నీటి దినోత్సవం రోజున వీరందరితో సమావేశమై నీటి వృథాను అరికట్టడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాం. 4 నుంచి 5 లక్షల జనాభాకు అవసరమైన మంచినీరు వృథా జరుగుతున్న తీరుతెన్నులపై విస్తృతంగా చర్చించిన తర్వాత ప్రతి పౌరుడిలో నీటి ప్రాధాన్యం, గొప్పతనం, అవసరం గురించి సమగ్రంగా చర్చించినప్పుడే వారిలో చైతన్యం వస్తుందనే అభిప్రాయం వ్యక్తం కావడం జరిగింది. ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతమయ్యే స్వచ్ఛ సర్వేక్షన్ లాంటి కార్యక్రమం, జీహెచ్ఎంసీ స్టాఫ్ హైదరాబాద్, శాందార్ హైదరాబాద్ కార్యక్రమాన్ని చేస్తున్నట్లుగానే నీటి వృథాను అరికట్టడంలో కూడా ప్రజలు భాగస్వాములైనప్పుడు 'వాక్' ఆశయం నెరవేరుతుంది. నీటి సంరక్షణ వలంటీర్ల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొని రావాలనే ఆశయంతో నీటి పొదుపులో భాగస్వాములు కావాలనుకున్నవారు, ఈ యజ్ఞంలో పాలు పంచుకుందామని భావించేవారు ఎవరైనా వారానికి కనీసం రెండు, మూడు గంటలు నీటి వృథాను అరికట్టడానికి కృషిచేస్తున్న 'వాక్'లో వలంటీర్లుగా స్వచ్ఛందంగా చేరవచ్చు. ఒక సామాజిక బాధ్యతగా పనిచేయాలనుకున్నవారు జలమండలి యాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యులు, కాలనీ సంఘాల సమన్వయ సహకారంలో ప్రతి వార్డులో, ప్రతి కాలనీలో నీటి పొదుపుపై సమావేశాలు ఏర్పాటుచేసి ప్రజలకు నీటి వృథా జరుగుతున్న తీరుపై వివరించాలి. ర్యాలీలు, ప్లకార్డుల ప్రదర్శన, ఇంటింటికీ వెళ్లి నీరు వృథా అవుతున్న తీరును ప్రజలకు అక్కడికక్కడే వివరించడం, నీటిని ఆదా చేయడం కోసం పరిమిత ప్రవాహ పరికరాలను బిగించుకోవడం మొదలైన వాటిపై వలంటీర్లు వివరించాలి. పాఠశాలలు, కళాశాలల్లో చర్చలు జరుగాలి. నీటికున్న ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేయాలి. నేటి నీటి వృథా, రేపటి కన్నీటి వ్యథ.. అని చెప్పాలి. నీటి వృథా అరికడితే రేపటి తరానికి మనం నీటిని ఇచ్చిన వాళ్లమవుతామనే భరోసాను ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉంటుంది. రేపటి తరానికి డబ్బుకన్నా విలువైనది నీరు అని గ్రహించాలి. ఆ నీటిని అవసరం ఉన్నంతవరకే వాడుకొని సద్వినియోగం చేసుకుందామనే ఆలోచన రావాలి. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలనే ఆలోచన ప్రజల్లో వచ్చినప్పుడు మంచినీటిని కూడా పొదుపుగా వాడుకోవాలని ఆలోచన తప్పకుండా రావాల్సిన అవసరం ఉన్నది. అందుకోసం నీటి మీటర్లు కూడా ఏర్పాటు చేసుకుంటే నీటి వినియోగంపై కూడా జాగ్రత్త ఏర్పడుతుంది. నీటి బిల్లులు కూడా అధిక నీటి వినియోగాన్ని తగ్గిస్తాయి. ఒక నీటి చుక్క వృథా చేయకుండా ఉంటే ఒక నీటిచుక్క పొదుపు చేసుకున్నట్లే అనే విషయాన్ని అందరం గ్రహించినప్పుడు విజయాన్ని సాధించినట్లే.

నేటి నీటి వృథా, రేపటి కన్నీటి వ్యథ.. అని చెప్పాలి. నీటి వృథా అరికడితే రేపటి తరానికి మనం నీటిని ఇచ్చిన వాళ్లమవుతామనే భరోసాను ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉంటుంది. రేపటి తరానికి డబ్బుకన్నా విలువైనది నీరు అని గ్రహించాలి. ఆ నీటిని అవసరం ఉన్నంతవరకే వాడుకొని సద్వినియోగం చేసుకుందామనే ఆలోచన రావాలి.

(వ్యాసకర్త: జలమండలి మేనేజింగ్ డైరెక్టర్)